హాల్‌టిక్కెట్లు ఇవ్వకుంటే కఠిన చర్యలు: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ కారణంగా ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఫీజు చెల్లించలేదని విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఇవ్వని విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రాక్టికల్స్‌కు అనుమతించకపోవడంతోపాటు విద్యార్థుల సర్టిఫికెట్లు కూడా విద్యార్థులకు ఇవ్వకుండా తమ వద్దే ఉంచుకుంటున్నట్లు తెలిసిందన్నారు. అలాంటి కళాశాలపై చర్యలు తప్పవన్నారు. బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు.

3.60 లక్షల మందికి నారాయణ సేవ

ముగిసిన సత్యసాయిబాబా జయంతి వేడుకలు

పుట్టపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతి వేడుకలు వారం రోజులపాటు కన్నుల పండువగా సాగి ఆదివారం అన్నదానంతో ముగిశాయి. ఆఖరి రోజు సాయంత్రం వరకు భక్తులకు నారాయణసేవ అందించారు. వారం రోజుల్లో 3.60 లక్షల మంది భక్తులకు నారాయణ సేవ అందించినట్టు ట్రస్టు వర్గాలు తెలిపాయి. ఈ నెల 18 నుంచి 24 తేదీ వరకు ఉదయం, సాయంత్రం నారాయణసేవ కొనసాగించారు.ఆఖరి రోజు సైతం వేలాది మంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సత్యసాయి సేవా దళ్ వైద్య బృందం వారం రోజులుగా ప్రశాంతి నిలయంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. రోగులకు ఉచిత వైద్యసేవలతో పాటు అవసరమైన మందులను అందజేశారు.


నారాయణ సేవలో పాల్గొన్న భక్తులు

ఊరంతా కన్నీరు


శ్మశాన వాటికలో బోరున విలపిస్తున్న కుటుంబ సభ్యులు

- ఎల్లుట్లలో మిన్నంటిన ఆర్తనాదాలు
- 8 మందికి అంత్యక్రియలు పూర్తి
- నివాళులు అర్పించిన ప్రముఖులు
- అండగా ఉంటామని హామీ

- వివరాలు 7లో..

బడివేళల్లో మార్పు

పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో 32 పాఠశాలల ఎంపిక
ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు..
నేటి నుంచి ఈనెల 30 వరకు పాటించాలి: డీఈఓ
వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు


పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన కొత్తచెరువు మండలం కొడపగానిపల్లి ఉన్నత పాఠశాల

ధర్మవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల పనివేళలను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పని వేళలను గంట పెంచింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కచ్చితంగా విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఆదేశించింది. జిల్లాలో 32 ఉన్నత పాఠశాలలను మొదట పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. ప్రతి మండలానికి ఒక ఉన్నత పాఠశాలను గుర్తించింది. ఎంపిక చేసిన పాఠశాలల వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప ఎంఈఓలకు, ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఉత్తర్వుల కాపీలను పంపారు. సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు ఈ పనివేళలను పాటించాలని డీఈఓ ఆదేశించారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించాలని, ప్రధానంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండటంతో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు అందులో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను ఉపాధ్యాయ సంఘాల నాయకులు వ్యతిరేకిస్తున్నారు. సాయంత్రం 5 గంటల వరకు పనిగంటలు పెంచితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని, దీంతో వారు మానసిక ఒత్తిడికి లోనవుతారని అభ్యంతరం చెబుతున్నారు.



విద్యానైపుణ్యాలు మెరుగు పరిచేందుకే..

విద్యార్థుల ప్రవర్తనలో మార్పు తెచ్చి, విద్యా నైపుణ్యాలను మరింత మెరుగుపరచడం కోసమే బడి పని వేళల్లో మార్పు చేశాం. ప్రతి మండలానికి ఒక ఉన్నత పాఠశాలను ఎంపిక చేశాం. వారం రోజులు గంటపాటు ఎక్కువ బడి వేళలు ఉండేలాగా ప్రయోగాత్మకంగా చేపట్టాం.

- కిష్టప్ప, డీఈఓ, శ్రీసత్యసాయి జిల్లా



ఈ నిర్ణయం సరికాదు

బడివేళలను ప్రభుత్వం మార్పు చేయడం సరైంది కాదు. ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యార్థులు బడిలో గడపడం వల్ల వారు మానసికంగా ఒత్తిడికి గురై బడి మానేసే పరిస్థితులు నెలకొంటాయి. ముఖ్యంగా బాలికలు తీవ్రంగా ఇబ్బందులు గురవుతారు. గతంలో ఉన్న బడి వేళలను కొనసాగించాలి.

-బీకే ముత్యాలప్ప, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు



వైభవంగా శ్రీహరి కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కదిరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామికి అర్జిత కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో ఆలంకరించారు. కదిరి మల్లెలు, తులసి, ఇతర పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామికి వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం పుణ్యాహవాచనం, విష్వక్సేన ఆరాధన, కళశారాధన, మాంగల్యధారణతో కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం శ్రీవారికి కల్యాణ కానుకలు సమర్పించారు. హాజరైన భక్తులకు వివిధ రకాల పువ్వులు, పండ్లు, వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహచార్యులు, పార్థసారిధి ఆచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దు బాబోయ్..!




రెండు నెలలకే చేతులెత్తేస్తున్న వ్యాపారులు

మార్జిన్ 9 శాతంతో నష్టాలంటూ ఆవేదన
వాటాలు వదులుకుంటున్న వైనం



హిందూపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మద్యం షాపుల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎగబడ్డారు. ఎప్పుడెప్పుడు ప్రభుత్వం ప్రకటన చేస్తుంది, టెండర్ వేద్దామని కాసుకున్నారు. ప్రభుత్వం టెండర్‌కు ఆహ్వానించడంతో ఎన్నడూలేనివిధంగా ఈసారి మద్యం షాపులకు ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షలు విధించినా ఒక్కోషాపునకు 30 నుంచి 50 దరఖాస్తులు వేశారు. ఈ లెక్కన ఒక్క షాపునకు రూ.60లక్షల నుంచి రూ.కోటిదాకా డీడీలు తీశారు. అయినా కూటమి పార్టీలోని కొంతమంది నాయకులు మద్యంషాపులు దక్కించుకోవడానికి ఎంతో కష్టపడ్డారు. గతంలో ఏనాడూలేని విధంగా ఈసారి మద్యం వ్యాపారంలోకి కొత్తవారు చాలామంది ప్రవేశించారు. ఈ కారణంగానే ప్రభుత్వానికి మంచి ఆదాయం వచ్చిపడింది. కొంత మంది తటస్థులకు బహిరంగ వేలంలో షాపులు దక్కడంతో కొన్నిచోట పైరవీలు చేశారు. మరికొన్నిచోట్ల షాపులు దక్కించుకున్న వ్యక్తులను భయభ్రాంతులకు గురిచేసి కొన్నిచోట్ల వారికి అడిగినంత డబ్బు ఇచ్చి కూటమి నాయకులు దక్కించుకున్నారు. షాపులు ప్రారంభమై రెండు నెలలు తిరగకనే తమకు షాపులు వద్దనీ, తమ వాటా ఇచ్చేస్తామనీ, తీసుకోండంటూ కొంతమంది మద్యం వ్యాపారులు వెంటపడుతున్నారు. ఇందుకు కారణం ప్రభుత్వం జీవోలో 20 శాతం మార్జిన్ పేర్కొని, ప్రస్తుతం ఇస్తున్నది 9 శాతంలోపే కావడం. దీంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోందనీ, భవిష్యత్తులో మార్జిన్ పెంచినా పెద్దగా ఫలితం ఉండదని వ్యాపారులు భావిస్తున్నారు.

నెలకే ఇన్‌స్టాల్‌మెంట్

ఒక షాపునకు ఏడాదికి రూ.65లక్షలు చెల్లించాలి. ఆరు ఇన్‌స్టాల్‌మెంట్లలో మొత్తాన్ని రూ.65లక్షలు చెల్లించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అక్టోబరు 14న షాపులు ప్రారంభించుకోవచ్చని చెప్పారు. కొంతమంది అక్టోబరు 20దాకా తెరుచుకుంటూ వచ్చారు. ఈ లెక్కన రెండు నెలలు ఇన్‌స్టాల్‌మెంట్ కట్టాలంటే డిసెంబరులో చెల్లించాల్సి ఉంటుంది. నవంబరు 20లోపే ఇన్‌స్టాల్‌మెంట్ కట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నెలకే ప్రతిషాపు నుంచి రూ.11 లక్షల వరకు చెల్లించారు. అక్కడ షాపులో వ్యాపారం మాత్రం అంతంతే. దీనిని గమనించిన తెలివిగల వ్యాపారులు ఇంతమొత్తం పెట్టి వ్యాపారాలు సాగకపోవడంతో భవిష్యత్తులో పెట్టిన సొమ్ము కూడా వెనక్కురాదని వారి వాటాలు అమ్ముకోవడానికి సిద్ధమయ్యారు. రెండు నెలలు గడవకముందే హిందూపురం నియోజకవర్గంలో తొమ్మిది షాపులుండగా నాలుగింటికి సంబంధించిన వ్యాపారులు వాటాలు ఇచ్చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే హిందూపురం నియోజకవర్గంలో మూడు షాపులకు సంబంధించి వాటాలను ఇచ్చేశారు. అందులో వచ్చే లాభం వద్దు, నష్టం వద్దు తాము పెట్టిన సొమ్ము వెనక్కు ఇచ్చేస్తే చాలంటూ వేడుకుంటున్నారు. హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు సంబంధించిన షాపుల్లో వాటాలను విక్రయించేసినట్లు తెలిసింది.

నష్టాలు తప్పవని..

ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీతో 20శాతం మార్జిన్ ఇవ్వనున్నట్లు చెప్పింది. ఇప్పటి వరకు 9శాతంలోపే అందుతోంది. ఇది ఏమాత్రం సరిపోదని వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కో షాపునకు కూటమి నాయకులు రింగుగా ఏర్పడి 20 నుంచి 30 డీడీలు తీశారు. 20 డీడీలనుకున్నా రూ.40 లక్షలు, ఏడాదికి లైసెన్స్ ఫీజు రూ.65లక్షలు. దీంతో పాటు అడ్వాన్స్, బాడుగ, ఇతరత్రా ఖర్చులు ఒక్క షాపుపై ఏడాదికి రూ.1.10కోటి నుంచి రూ.1.20కోటి దాకా ఖర్చవుతుంది. ఇందులో రూపాయి కూడా వ్యాపారికి వెనక్కు వచ్చేది కాదు. దీంతో నెలకు అన్ని ఖర్చులుపోనూ రూ.10లక్షలు మిగిలితే వ్యాపారికి అసలు వస్తుంది. అంటే రోజుకు రూ.30 నుంచి రూ.40వేలు మిగలాలి. ఇంత మిగలాలంటే రోజుకు ఒక్కషాపులో రూ.5లక్షలకు తగ్గకుండా వ్యాపారం సాగాలి. ప్రస్తుతం హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల పరిధిలోని షాపులకు రోజుకు అత్యధికంగా అంటే రూ.3లక్షలు మించదు. చాలా షాపులకు రోజూ రూ.80వేల నుంచి రూ.1.50 లక్షలు మాత్రమే వ్యాపారం అవుతోంది. దీంతో నెలకు ఒకషాపు నుంచి రూ.5లక్షల నుంచి రూ.6లక్షలదాకా నష్టం వస్తోంది. ఇలాగే ఏడాదిపాటు జరిగితే ఒక షాపు నుంచి రూ.60లక్షల నుంచి రూ.70లక్షల దాకా నష్టం వచ్చే అవకాశం ఉంది. దీంతో అప్రమత్తమైన పలువురు వ్యాపారులు వాటాలు అమ్మడానికి సిద్ధపడుతున్నారు. మరో రెండు నెలల్లో మార్జిన్ పెంచకపోతే వచ్చే జనవరి నాటికి షాపు లైసెన్స్ సొమ్ము కూడా కట్టరు.

లబోదిబోమంటున్న వ్యాపారులు

ప్రభుత్వానికి కట్టాల్సిన సొమ్ము, ఖర్చులు ఇతరాత్ర వాటిని లెక్కించారు. ప్రభుత్వం అందిస్తున్న మార్జిన్ చూసి వ్యాపారులు నివ్వెరపోతున్నారు. దీంతో ఈ ఏడాది ఇలాగే కొనసాగితే మద్యం జోలికి వెళ్లే ప్రసక్తే ఉండదు. దీంతో మద్యం వ్యాపారులు ఈషాపులు వద్దుబాబోయ్ అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటిదాకా బ్రాండ్లు పూర్తిస్థాయిలో రాకపోవడంతో వ్యాపారాలు పూర్తిస్థాయిలో సాగడంలేదంటూ వాపోతున్నారు. ఈ నేపథ్యంలో షాపులో తాము పెట్టిన డబ్బు చెల్లిస్తే వాటా ఇచ్చేస్తామని ఒత్తిడి తెస్తున్నారు.

వేటు వేయాల్సిందే..

పార్టీకి ద్రోహం చేసేవారిపై చర్యలు తీసుకోవాల్సిందే..
ముఖ్య నేతల వద్ద దీపిక వర్గం డిమాండ్

హిందూపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పదవులు అనుభవించి పార్టీకి ద్రోహం చేస్తున్న నాయకులపై వేటు వేయాల్సిందేనని దీపికవర్గం డిమాండ్ చేసింది. నియోజకవర్గ వైసీపీలో నెలకొన్న విభేదాలను చక్కదిద్దేందుకు అన్నివర్గాల అభిప్రాయాలు సేకరించి, అధిష్ఠానానికి పంపేందుకు ఆదివారం పులివెందులకు చెందిన వైసీపీ నాయకుడు సతీష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ హిందూపురానికి వచ్చారు. మొదట వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక కార్యాలయంలో సమావేశమయ్యారు. దీనికి పట్టణంలోని కొంతమంది కౌన్సిలర్లు, నాయకులు చిలమత్తూరు మండలానికి చెందిన ఎంపీపీతోపాటు మరికొంతమంది నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని పార్టీలో ఎందుకు ఉంచుకుంటున్నారని ప్రశ్నించారు. 2గంటలుపైగా సమావేశం సాగినా పరోక్షంగా నవీన్‌నిశ్చల్, కొండూరు వేణుగోపాల్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ దీపికవర్గీయులు.. ముఖ్యనేతల వద్ద మాట్లాడారు. కొంతసేపు గందరగోళం ఏర్పడింది. మీడియా వారిని రానీయకుండా జాగ్రత్త పడ్డారు. అక్కడే రహస్యంగా దీపికతోపాటు మరికొంతమంది ముఖ్యనేతలు కలిసి అభిప్రాయాలు సేకరించారు. నిన్నటి వరకు దీపిక వెంట ఉన్న మున్సిపల్ చైర్మన్ బలరాంరెడ్డి, లేపాక్షి ఎంపీపీ, జడ్పీటీసీతోపాటు మరికొంతమంది ముఖ్య నాయకులు ఆమె కార్యాలయంలో సమావేశానికి డుమ్మాకొట్టి నవీన్ ఆఫీసుకు చేరుకున్నారు.

నవీన్‌నిశ్చల్ వర్గాన్ని కలవని నేతలు

హిందూపురం వైసీపీలో నాలుగు వర్గాలున్నాయి. ఆదివారం దీపిక వర్గాన్ని మాత్రమే కలిసి అభిప్రాయాలు తెలుసుకున్నారు. నవీన్‌నిశ్చల్ కార్యాలయానికి ఉదయం 11 గంటలకే వస్తామని సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం 2గంటల వరకు నవీన్‌నిశ్చల్, మునిసిపల్ చైర్మన్ బలరాంరెడ్డి, ఎంపీటీసీ, జడ్పీటీసీ మరికొంతమంది ముఖ్యనాయకులు, కార్యకర్తలు వేచిచూశారు. మధ్యాహ్నం నవీన్‌నిశ్చల్.. సతీష్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఉదయం నుంచి వేచి చూసినా కలవలేదనీ, తరువాత వచ్చినపుడు కలుద్దామని చెప్పారు. దీంతో హిందూపురానికి వచ్చిన ముఖ్యనేతలు దీపికవర్గాన్ని కలిసి వెనుతిరిగిపోయారు. కొండూరు వేణుగోపాల్‌రెడ్డి కలవకుండా బయటకు వెళ్లిపోయినట్లు సమాచారం. మధుమతి వర్గం కూడా దూరంగా ఉంది. ఈ లెక్కన నియోజకవర్గ వైసీపీలో విభేదాలు తారాస్థాయికి చేరినాయనడంలో సందేహంలేదు. నేతలు రహస్యంగా మాట్లాడినపుడు వారంలోపు హిందూపురంలో ఒక మార్పు ఉంటుందని చెప్పి వెళ్లినట్లు దీపిక వర్గీయులు చెప్పుకుంటున్నారు.

రైతులు ఒప్పుకుంటేనే ముందుకు..

జిల్లేడుబండ ప్రాజెక్టు పనులపై మంత్రి సత్యకుమార్

ముదిగుబ్బ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు ఒప్పుకుంటేనే జిల్లేడుబండ ప్రాజెక్టు పనులు మొదలు పెడతామని మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని జిల్లేడుబండ ప్రాజెక్టును ఆదివారం సాయంత్రం ఆయన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. వివరాలను రైతుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 23వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్న జిల్లేడుబండ ప్రాజెక్టును 8 కిలోమీటర్ల మేర ప్రాజెక్టును నిర్మిస్తున్నారంటే ఆశ్చర్యం వేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో గ్రామసభలు, రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా బలవంతంగా భూములు లాక్కొని ప్రాజెక్టును నిర్మిస్తున్నారంటే దాని వెనుక ఉద్దేశ్యం ఏమిటో ఇప్పుడు అర్థమవుతోందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రయోజనం ఎంత ఉందన్న అభిప్రాయాలు సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పరిహారం కోసం పోరాడుతున్న సర్పంచ్‌ను, రైతులను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. రైతుల ఇష్టప్రకారమే ఇక్కడ ఏమైనా జరుగుతుందని, దాని ప్రకారం ప్రాజెక్టు పనులు ముందుకు సాగుతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ... గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం మంచి చేసిన దాఖలాలే లేవని, ఇరిగేషన్, విద్య, వైద్య రంగాలలో ప్రజలకు పూర్తి అన్యాయం చేసిందన్నారు. పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ జిల్లేడుబండ ప్రాజెక్టు కింద నష్టపోతున్న రైతుల పక్షాన గత నాలుగేళ్ల నుంచి పోరాడుతున్నామన్నారు. ఈవిషయంపై రెండు రోజుల క్రితం మంత్రి సత్యకుమార్‌తో కలిసి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వివరించామన్నారు. రైతులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేస్తామని పరిటాల శ్రీరామ్ హామీ ఇచ్చారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు అంశం సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి రైతుల సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చిలకం మధు మాట్లాడుతూ జిల్లేడుబండ రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, ఇరిగేషన్ అధికారులు, రాష్ట్ర టీడీపీ రైతు కార్యదర్శి రమేశ్‌బాబు, ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మలమనోహర్, బీజేపీ కన్వీనర్ సోమలప్రకాశ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.


సభా వేదికపై మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే తదితరులు


ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఊరంతా కన్నీరు

ఎల్లుట్లలో మిన్నంటిన ఆర్తనాదాలు

8మందికి అంత్యక్రియలు పూర్తి

నివాళులు అర్పించిన ప్రముఖులు

అండగా ఉంటామని హామీ



తల్లిదండ్రుల మృతదేహాలను చూసి బోరున విలపిస్తున్న బీఎస్ఎఫ్ జవాను హర్షవర్ధన్



సొమ్మసిల్లిపోయిన మహిళను పక్కకు తీసుకువెళుతున్న దృశ్యం



భార్యభర్త మృతదేహాలకు అంత్యక్రియలను నిర్వహిస్తున్న దృశ్యం

పుట్లూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఊరంతా ఏడుపులు, పెడబొబ్బలు, ఆర్తనాదాలే. ఎవరిని పలకరించినా కంట కన్నీరు తప్ప నోటమాట రావడం లేదు. తమకు అయిన వారికి కడసారి వీడ్కోలు పలికేందుకు ఊరంతా బంధువులు, స్నేహితులతో నిండిపోయింది. ఇదీ మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో ఆదివారం పరిస్థితి. గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద శనివారం జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలపెద్దయ్య, చిన్ననాగమ్మ, చిన్ననాగన్న, రామాంజనమ్మ, జయరాముడు, కొండమ్మ, ఈశ్వరయ్య, పెద్దనాగమ్మల మృతదేహాలను ఆదివారం మండలంలోని ఎల్లుట్ల గ్రామానికి తీసుకురావడంతో ఆర్తనాదాలు మిన్నంటాయి. ఒకేసారి గ్రామానికి చెందిన 8మంది మృతి చెందడంతో ఊరంతా విషాదంలో మునిగిపోయింది. కడసారి తమవారిని చూసేందుకు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్దఎత్తున తరలివచ్చారు. పలువురు రాజకీయ ప్రముఖులు వచ్చి మృతదేహాలకు నివాళులు అర్పించి, బాధిత కుటుంబాలను ఓదార్చారు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాలను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబులెన్స్‌లో ఉదయం 8గంటలకల్లా గ్రామానికి చేర్చారు. గ్రామసరిహద్దులో మృతదేహాలను చూసిన గ్రామస్థులు దుఃఖాన్ని ఆపుకోలేక బోరుమన్నారు. కొందరు మహిళలు సొమ్మసిల్లిపడిపోయారు. మరికొందరు మృతదేహాల మీదపడి రోదించారు. మృతదేహాలను ఇళ్లకు చేర్చడానికి సుమారు అరగంట సమయం పట్టింది. అనంతరం మృతదేహాలకు సంప్రదాయం ప్రకారం చేయాల్సిన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరితరం కాలేదు. కొద్దిసేపటి తర్వాత అతికష్టం మీద మృతదేహాలను అంత్యక్రియల కోసం అంబులెన్స్‌లోనే శ్మశానవాటికకు తరలించారు. అంత్యక్రియలను ఎక్స్‌కవేటర్ సాయంతో నిర్వహించారు. ఆర్డీఓ కేశవనాయుడు అంత్యక్రియలను దగ్గరుండి చేయించారు.

బాధితులకు అండగా ఉంటాం: బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన 8మంది మరణించడం ఎంతో బాధాకరమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం తెలిపారు. మృత దేహాలకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే చోట సూచికబోర్డులు ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామ న్నారు. అనంతరం బాధితుల ఇళ్లకు వెళ్లి ఆర్థికసాయం అందించి అండగా ఉంటామని తెలిపారు. ఆమె వెంట టీడీపీ నాయకులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డి, సుదర్శన్‌నాయుడు, చవ్వా కులశేఖర్ రెడ్డి, విజయ్‌కుమార్‌నాయుడు, గోవర్ధన్‌రాజు రవీంద్రచౌదరి తదితరులు ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు

మనసును కలచివేసింది: ఎమ్మెస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

రోడ్డుప్రమాదం తన మనసును తీవ్రంగా కలచివేసిందని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. ఎల్లుట్లలో పర్యటించి మృతదేహాలకు నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమాదంపై ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. ప్రభుత్వం తరఫున రూ.5లక్షల పరిహారాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సినవి తప్పకుండా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి: జేసీ ప్రభాకర్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్

ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలు బాధిత కుటుంబాలకు ఏమాత్రం సరిపోదని వాటికి తగ్గట్టు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్లుట్లలోని శ్మశానం వద్ద ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగం డిమాండ్‌పై స్పందించకపోతే ఊరు మొత్తాన్ని తీసుకెళ్లి కలెక్టరేట్ స్పందనలో ధర్నాకు కూర్చొంటామని హెచ్చరించారు. త్రీవీలర్ ఆటోలను బ్యాన్ చేయాలన్నారు. డ్రైవర్ సీటులో అటు ఇటు నలుగురిని కూర్చొబెట్టుకుంటే స్టీరింగ్ ఎలా తిరుగుతుందని ప్రశ్నించారు.

మాజీ ఎమ్మెల్యే యామినీబాల కంటతడి

రోడ్డు ప్రమాదంలో మృతులను చూసి మాజీ ఎమ్మెల్యే యామినీబాల బోరున విలపించారు. ఇలాంటి దురదృష్టకర సంఘటన ఎన్నడూ జరగలేదని చెప్పారు. మృతదేహాలకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట టీడీపీ నాయకుడు సతీష్ తదితరులు ఉన్నారు.



మృతదేహాలను స్మశానానికి తరలించడంతో ఇంటివద్ద రోదిస్తున్న బంధువులు

అధైర్యపడవద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు మంత్రి కేశవ్ భరోసా

పరిహారం చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

పుట్లూరు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన, గాయపడిన వారి కుటుంబాలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం రాత్రి పరామర్శించారు. అధైర్యపడవద్దనీ, ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. బస్సు- ఆటో ఢీకొన్న ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించగా.. ఐదుగురు గాయపడ్డారు. బాధితులంతా జిల్లాలోని పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందినవారు. మృతులకు స్వగ్రామంలో ఆదివారం అంత్యక్రియలు పూర్తిచేశారు. మంత్రి కేశవ్.. ఎల్లుట్ల గ్రామానికి చేరుకుని, బాధితుల ఇళ్ల వద్ద కెళ్లి పరామర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియో చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల చొప్పున పరిహారాన్ని చెక్కుల రూపంలో ఇచ్చామన్నారు. ప్రభుత్వం తరఫున అవుట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగ అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. బాధితుల పిల్లలను కోరినచోట చదివిస్తామని హామీ ఇచ్చారు. బాధితులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే అని మంత్రి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ పాల్గొన్నారు.

అమ్మా... దండం పెట్టి చెబుతున్నా..!

ఇంతమంది ఒకే వాహనంలో ప్రయాణం చేయకండి

శుభకార్యానికి వెళుతున్న బృందానికి మంత్రి సవిత సూచన



గార్లదిన్నె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా.. మీకు దండం పెడతా..! ఇలా నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణం చేయకండి. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే అప్పుడు ఎవరు దిక్కు. అందుకే జాగ్రత్తలతో ప్రయాణం చేయండి' అని మంత్రి సవిత లగేజీ బొలెరో వాహనంలో శుభకార్యానికి వెళుతున్న వారికి సూచించారు. మండలంలోని తలగాసిపల్లి జంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం ఆటోను బస్సు ఢీ కొనడంతో 8 మంది కూలీలు దుర్మరణం చెందగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన స్థలాన్ని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి వీర్రాజు, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎంవీఐ సునీత, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తదితరులు ఆదివారం పరిశీలించారు. ఈ క్రమంలోనే గుత్తి మండలం పెదొడ్డి గ్రామానికి చెందిన పలువురు నూతిమడుగుకు గ్రామానికి పెళ్లి చూపుల కోసం లగేజీ బొలెరో వాహనంలో బయల్దేరారు. ఆ వాహనాన్ని అధికారులు తలగాసిపల్లి క్రాస్ వద్ద నిలిపారు. అదే సమయంలో అటుగా వెళుతున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తన వాహనాన్ని ప్రమాద స్థలం వద్ద ఆపారు. ప్రమాదం ఎలా జరిగిందని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు, డీఎస్పీ వెంకటేశ్వర్లుతో ఆరా తీశారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో తమ వాహనాన్ని పంపించాలని శుభకార్యానికి వెళుతున్న వారు మంత్రి సవితకు విన్నవించారు. లగేజీ వాహనాలలో ప్రయాణం చేయడమే తప్పు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువమంది ప్రయాణించడం ఏంటని ప్రశ్నించారు. ప్రమాదాలు జరిగితే మనమే తప్పు పడతాం. అలాంటిది ఇలాంటి వాహనాలలో ఎలా ప్రయాణిస్తారని ప్రశ్నించారు. లగేజీ వాహనాలలో ప్రయాణం చేయద్దని, మీకు కావాలంటే మరో వాహనం ఏర్పాటు చేస్తాం అందులో వెళ్లాలని మంత్రి వారికి కి సూచించారు.



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ

తల్లిదండ్రులు మూస ధోరణి వీడాలి

పిల్లల అభిరుచులను ప్రోత్సహించాలి

ఆలిండియా సర్వీసులకు పంపించాలి

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కొడిదెల లక్ష్మీనారాయణ



వనభోజన కార్యక్రమానికి హాజరైన కమ్మ కులస్థులు

గుంతకల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తాము సాధించలేని లక్ష్యాలను తమ పిల్లలు పూర్తిచేసేలా చూసే మూస ధోరణిని విడనాడి, వారి ఉత్సాహం ఎందులో ఉందో తెలుసుకుని ప్రోత్సహించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి కొడిదెల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీ శంకరానందగిరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కమ్మ సంఘ కార్తీక వన భోజన కార్యక్రమానికి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంజనీరింగ్ చేయించాలన్న తలంపుతో ఉన్నారని అన్నారు. ప్రపంచం చాలా విశాలమైనదని, ఒక్క ఇంజనీరింగును చదివించడమే లక్ష్యంగా పెట్టుకోకుండా మారుతున్న కాలానుగుణంగా పిల్లల మనోభీష్టాన్ని అనుసరించి ప్రోత్సహించాలన్నారు. కమ్మ కులస్థుల్లో ధన సంపాదనా వ్యామోహం పెరిగిపోయిందని, ఉద్యోగ, వ్యాపార రంగాలతోపాటు పరిపాలనా విభాగంలోకి కూడా దృష్టిని సారించాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ లాంటి ఆలిండియా సర్వీసెసులు, రాజకీయాల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు తెలుగు బాగా నేర్పించాలని, మాతృభాష అలవడినప్పుడే ఇతర భాషలను అభ్యసించడం సులుభమవుతుందన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలే కాకుండా ఇతర భాషలను కూడా నేర్చుకునేలా పిల్లలను ప్రోత్సాహించాలని అన్నారు. ఆచార, సంప్రదాయాలను అనుసరిస్తూనే నూతన సాంకేతికతను చేజిక్కించుకుని కెరీర్‌ను నిర్మించుకోవాలన్నారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కార్యక్రమం చివరలో సమావేశానికి వచ్చి కమ్మ కుల సంఘ ప్రముఖులను, సంఘ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా లాస్య, విశిష్ఠ, పూజిత ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో మార్కెట్ ఫెడరేషన్ డైరెక్టర్ కేసీ హరి, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, చింబిలి వెంకటేశ్వర్లు, కమ్మ సేవా సంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్యదర్శి బాబు, ట్రెజరర్ డాక్టర్ రామ్మూర్తి, కొట్టాల సురేశ్‌నాయుడు, ప్రిన్సిపాళ్ల గోపాల్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కాకతీయ వనమహోత్సవ వేదికపై మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరులు

రాప్తాడు : అఖిల భారత కాకతీయుల ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఐకమత్యంగా కార్తీక వనభోజనాలు నిర్వహించడం అభినందనీయమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని హంపాపురం సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన అఖిల భారత కాకతీయ ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజనాల కార్యక్రమానికి మంత్రితో పాటు రాప్తాడు, అనంతపురం ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు ఉన్నం హనుమంతరాయచౌదరి, వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, ధర్మవరం టీడీపీ నాయకులు గోర్తి సుధాకర్‌నాయుడు, భారతీదేవి, జిల్లాలోని ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. శృంగేరి శంకర మఠం పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ కార్తీక మాసంలో ఐకమత్యంగా వనభోజనాలు నిర్వహించడం శుభపరిణామం అన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఎన్టీ రామారావు, పరిటాల రవీంద్ర లాంటి వారు కమ్మ కులంలో జన్మించి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచారన్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారికి సాయం అందించడంతో కమ్మ కులం ఎప్పటికీ ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అనంతలక్ష్మి చైర్మన్ అనంతరాముడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మంత్రులు, ఎమ్మెల్యేల పరామర్శ

ఆరోగ్య పరిస్థితిపై ఆరా... అండగా ఉంటామని హామీ





బాధితుల కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మంత్రులు సత్యకుమార్, టీజీ భరత్

అనంతపురం టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలం తలగాసిపల్లిక్రాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను మంత్రులు, ఎమ్మెల్యేలు ఆదివారం పరామర్శించారు. రాష్ట్ర వైద్యశాఖామంత్రి సత్యకుమార్, జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి, పరిశ్రమలశాఖామంత్రి టీజీభరత్, ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎంఎస్‌రాజు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్‌తదితరులు వేర్వేరుగా బాధితులను పరామర్శించారు. మంత్రులు వెంట జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ వచ్చారు. క్షతగాత్రుల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని అందుకు అవసరమైన డబ్బు ప్రభుత్వం అందిస్తుందని సవీరా ఆస్పత్రి యాజమాన్యం, డాక్టర్లకు మంత్రులు సూచించారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నిరుపేద కూలీలు ప్రమాదంలో ఎనిమిది మంది ఒకే ఊరివారు మరణించడం బాధాకరమన్నారు. ఇప్పటికే మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు రూ.5లక్షల సాయం ప్రకటించారన్నారు. క్షతగాత్రుల వైద్యచికిత్సలకు అవసరమైన డబ్బును ప్రభుత్వమే ఖర్చు పెడుతుందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులు, వారి కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, సరిపూటిరమణ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా ఆ ఐదుగురి ఆరోగ్యం: డాక్టర్లు

ప్రమాదంలో గాయపడిన కూలీలు రామాంజినమ్మ, గంగాధర్, లక్ష్మీదేవి, పెద్దులమ్మ, డ్రైవరు నీలకంఠేశ్వర కిమ్స్ సవీరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరందరి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులతో పాటు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ. దేవి తెలిపారు. వీరిలో గంగాధర్ మాత్రమే ఇంకా ఐసీయూలో ఉన్నారని, మిగిలిన బాధితులు సాధారణ వార్డులో చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్ఓ తెలిపారు. కలెక్టరు, మంత్రులు ఆదేశాల మేరకు బాధితులకు అన్నిరకాల వైద్యసేవలను అందిస్తున్నామని డీఎంహెచ్ఓ అన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీ

రూ. 8 లక్షల విలువైన ఆభరణాల అపహరణ

కళ్యాణదుర్గం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం కదిరిదేవరపల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన మేరకు.. కార్తీక మాసం కావడంతో శనివారం రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. తరువాత ఆలయానికి తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం అర్చకుడు తిప్పేస్వామి తాళాలు పగులగొట్టినట్లు గుర్తించారు. విషయాన్ని గ్రామస్థుల ద్వారా పోలీసులకు తెలిపారు. డీఎస్పీ రవిబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ పరిసర ప్రాంతాల్లో సంచరించారని, వారే ఈ దొంగతనానికి పాల్పడి వుండవచ్చునన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో వున్న హుండీని కూడా ధ్వంసం చేశారు. బంగారం, వెండి ఆభరణాలు, హుండీలో నగదును కూడా ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సుమారు రూ. 8 లక్షల వరకు చోరీకు గురై వుంటుందని గ్రామస్థులు తెలిపారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ ఒక్క ఆర్యవైశ్యునికి సమస్య వచ్చినా అండగా నిలిచి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి భరత్‌తోపాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. ప్రమాణ స్వీకారోత్సవ సభలో భరత్ మాట్లాడుతూ తెలుగుదేశ పార్టీ ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు తనపై నమ్మకంతో రాష్ట్రానికి ఎంతో కీలకమైన పరిశ్రమలశాఖకు తనను మంత్రిగా చేశారని కొనియాడారు. దేశ, విదేశాల నుంచి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు తరలివస్తున్నారన్నారు. జిల్లాలో ఆర్యవైశ్యుల సత్రం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ సేవకు మారుపేరు ఆర్యవైశ్యులని, వారి సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించి యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపారులు మాత్రమే కాదని, సామాజిక సేవకులు కూడా అని పేర్కొన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యత చూస్తుంటే తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ ఆర్యవైశ్యుడైన పొట్టిశ్రీరాములు పోరాటంతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన జరిగిందని, ఆ మహనీయుని సామాజికవర్గమైన ఆర్యవైశ్యులంతా ధన్యులేనని కొనియాడారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు శబరి వరప్రసాద్‌తోపాటు కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, టీడీపీ నాయకులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, జనసేన నాయకుడు భవానీ రవికుమార్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నిరామ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పెనుగొండ సుబ్బరాయుడు, నాయకులు కోటా సత్యం, తిరుపీధుల జగదీష్ కుమార్, దేవకీ వెంకటేశ్వర్లు, శిరిగుప్ప వెంకటేశ్వర్లు, మనోజ్, కలవల సతీష్, వంకదారు వెంకట కృష్ణ, ముడియం రమణ, గోపా మచ్చా నరసింహులు, పిన్ని నాగరత్నం పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నడక ఆరోగ్యానికి ఎంతో అవసరం



వాకథాన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీఓ మహేశ్

ధర్మవరం,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నడక, వ్యాయామంతో పాటు సరైన ఆహారపు అలవాట్లు మనిషి ఆరోగ్యంగా ఉండటానికి సహకరిస్తాయని ఆర్డీఓ మహేశ్ అన్నారు. ఆదివారం ధర్మవరం సైక్లింగ్ అండ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకథాన్‌ను ఆర్డీఓ ప్రారంభించారు. స్థానిక బాలుర ఉన్నతపాఠశాల నుంచి పోతుకుంట రోడ్డులోని ప్రియదర్శిని వరకు నిర్వహించారు. అక్కడి నుంచి కాలేజీ సర్కిల్ వరకు చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డీసీవీసీ గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు, సభ్యులు గోరకాటిపెద్దారెడ్డి, దాత జింకా రామాంజనేయులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌పీ జిల్లా కమిటీ ఎంపిక



జిల్లా కమిటీ సభ్యులు

కదిరి అర్బన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా స్టూడెంట్ పవర్ (ఏఐఎస్‌పీ) సత్యసాయి జిల్లా కమిటీని ఎంపిక చేశారు. సంఘం మహాసభలు రెండవరోజులో భాగంగా ఆదివారం కమిటీని ఎంపిక చేసినట్లు ఇన్‌చార్జి రాజేష్ తెలిపారు. అధ్యక్షుడిగా ఉదయ్, కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షులు పృథ్వీరాజ్, కిరణ్, ఆదిత్య, సహాయ కార్యదర్శులు అజయ్, దర్శన్, అభిరాజ్‌తోపాటు మరికొంతమందిని ఎంపిక చేశారు. విద్యార్థి సంఘం నాయకులు నరసింహ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులను ఆదివారం ఎన్జీవో హోమ్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వైవీ సుబ్బారెడ్డి, గౌస్‌ఖాన్, జంషీర్ హాజరయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులకు పూలమాలలు, శాలువలతో సన్మానించారు. కదిరి ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయులు ఇర్షాన్, కౌసర్, షేక్ మహమ్మద్‌కు అవార్డు రావడం హర్షించతగ్గ విషయమన్నారు. తాహేర్‌వలీ, అజాంబాషా, రవివర్ధన్, ఖాజా, ఇర్షాన్, ఖాజా పీర్, లక్ష్మీనారాయణ, హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులను అందజేస్తున్న విదేశీ మహిళ

కొత్తచెరువు/పుట్టపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాగిరెడ్డిపల్లి రహదారిలో ఉన్న పేద కుటుంబాలకు పోలాండ్ దేశానికి చెందిన క్రిస్టినా నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీచేశారు. రూ.5వేలు విలువ చేసే పది రకాల సరుకులను పది కుటుంబాలకు ఆమె అందజేశారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- అక్క కోసం పసికందు కిడ్నాప్..
- అనంతపురం నుంచి వచ్చి నిలోఫర్ వద్ద ఎత్తుకెళ్లిన వైనం
- కర్నూల్ హైవేపై ముగ్గురు నిందితుల అరెస్ట్

మంగళ్‌హాట్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): నిలోఫర్ ఆస్పత్రి వద్ద కిడ్నాప్‌నకు గురైన పసికందు కథ సుఖాంతమైంది. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులను దాటించక ముందే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన హసీనాబేగం, గఫార్ దంపతులకు 45రోజుల బాబు ఉన్నాడు. కామెర్లు రావడంతో చిన్నారిని నిలోఫర్‌లో అడ్మిట్ చేశారు. ఆరోగ్యం కుదుటపడడంతో శనివారం వైద్యులు డిశ్చార్జ్ చేశారు. శనివారం సాయంత్రం నిలోఫర్ నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో ఓ గుర్తుతెలియని మహిళ వద్దకు వచ్చి తాను ఈ ఆస్పత్రిలోనే పనిచేస్తానని పరిచయం చేసుకుంది. ఇంతలో సంతకం చేయాలని హసీనాను ఆమె తల్లి పిలవడంతో అక్కడున్న మహిళ నీవు సంతకం పెట్టి రా.. మీ బాబును నేను చూసుకుంటానని చెప్పింది. దీంతో బాబును ఆమెకు ఇచ్చి సంతకం పెట్టడానికి చిన్నారి తల్లి వెళ్లింది. తిరిగి వచ్చేలోపు ఆ మహిళ కనిపించలేదు. దీంతో బాబును కిడ్నాప్ చేశారని గుర్తించిన తల్లి, అమ్మమ్మ నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. కర్నూల్ జిల్లా వైపు నిందితులు వెళ్తున్నట్లు గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం అందించడంతో ఉన్నతాధికారులు సూచనల మేరకు ఎస్‌ఐలు నాగరాజు(అలంపూర్ పీఎస్), చంద్రకాంత్(మానవపాడ్ పీఎస్), మహేష్‌గౌడ్ (ఉండవల్లి పీఎస్) తమ సిబ్బందితో కలిసి అదేరోజు రాత్రి 10.30 గంటల సమయంలో పుల్లూర్ టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఏపీ 28 ఏవీ 0785 నంబర్ గల ఓమ్నీ వ్యాన్ అటుగా రాగా అందులో ముగ్గురు చిన్నారులతోపాటు బురఖా ధరించిన ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి ఉన్నట్లు గుర్తించి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. వ్యాన్‌లో ఉన్న వారి కదలికలు అనుమానాస్పదంగా అనిపించడంతో వెంటనే వారిని అదుపులోకి తీసుకొని నిలోఫర్ వద్ద కిడ్నాప్‌కు సంబంధించిన ఫొటోలతో సరిచూడగా నిందితులతో పాటు కిడ్నాప్‌నకు గురైన బాబు అందులోనే ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.

అక్క కోసం కిడ్నాప్...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లా మేకల చెరువు ప్రాంతానికి చెందిన అబ్దుల్లా అలియాస్ వెంకటేష్, రేష్మా అలియాస్ రేణుక దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం. ప్రస్తుతం గర్భవతి అయిన రేణుక మళ్లీ ఆడపిల్లే పుడుతుందేమోనని ఆందోళన చెందేది. అయితే, రేణుక చెల్లి షహీన్ బేగం(28) అక్క కోరిక మేరకు ఓ బాబును ఎత్తుకొచ్చేందుకు సహకరిస్తానని ఒప్పుకుంది. పథకం ప్రకారం నిలోఫర్ ఆస్పత్రి వద్దకు షహీన్ బేగం తన బావ అబ్దుల్లా అలియాస్ వెంకటేష్‌తో చేరుకుంది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన హసీనాబేగం దృష్టి మరల్చి పసికందుతో ఆటోలో అక్కడి నుంచి పారిపోయారు. వీరు కర్నూలు చేరుకునేలోపే నగర పోలీసులు లంపూర్, మానవపాడ్, ఉండవల్లి పోలీసులను అప్రమత్తం చేశారు. ఓమ్నీ వ్యానులో వస్తున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని నాంపల్లి పోలీసులకు అప్పగించారు.

వలస పింఛన్‌దారులకు ఊరట

- గత వైసీపీ పాలనలో వ్యయప్రయాసలు
- కూటమి ప్రభుత్వ ప్రకటనతో లబ్ధిదారుల్లో ఆనందం


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి (ఫైల్)

ఓబుళదేవరచెరువు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పొట్టకూటికోసం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన పింఛన్‌దారులకు కూటమి ప్రభుత్వం ఊరటనిచ్చింది. గత వైసీపీ పాలనలో నెలనెలా పింఛన్ తీసుకోకపోతే రద్దు చేసేవారు. దీంతో వలస పింఛన్‌దారులు ఎంతో వ్యయప్రయాసలు పడి పింఛన్లు తీసుకెళ్లేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా మూడునెలలకు సంబంధించిన పింఛన్‌ను ఒకేసారి తీసుకోవచ్చని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో వలస పింఛనుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఓడీసీలో 7,690, అమడగూరు 4,859, నల్లమాడలో 7,099 మంది పింఛన్‌దారులున్నారు. వీరిలో 15 నుంచి 20 శాతం మంది పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లారు. కూటమి ప్రభుత్వం ప్రకటనతో వారికి ఉపశమనం కలిగింది.

పింఛన్‌దారుల్లో ఆనందం

గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాదిగా నిలిచిపోయిన అర్హులైన పింఛనుదారుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం నూతన పింఛన్లకు డిసెంబర్ నెలనుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. వృద్ధులు, వితంతువులు చాలమందికి ఏడాది నుంచి పింఛన్ రాక ఇబ్బందులు పడేవారు.

భర్త చనిపోయిన మరుసటి నెల నుంచే పింఛన్

వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని మృతిచెందితే అతని భార్యకు మరుసటి నెల నుంచి వితంతు పింఛన్ మంజూరు చేసేలా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. గత పాలనలో కుటుంబ యజమాని మరణిస్తే భార్యకు పింఛన్ రావాలంటే నెలల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కుటుంబ యాజమాని మృతిచెందిన మరుసటి నెలనుంచి పింఛన్ ఇచ్చేలా చర్యలు చేపట్టింది

వ్యయప్రయాసలకు స్వస్తి

వలస పింఛన్‌దారులు గతంలో ప్రతినెలా పింఛన్లకోసం వ్యయప్రయాసలు పడి స్వగ్రామాలకు వచ్చి పింఛన్ తీసుకెళ్లేవారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యకు చెక్ పెట్టింది. మూడునెలలకు ఒకసారి పింఛన్ తీసుకోవడానికి వెసులుబాటు కల్పించింది. వలసదారులు, దీర్ఘకాలిక వ్యాధులతో చికిత్సలు పొందుతున్న వారికి ప్రభుత్వం ఊరట కల్పించింది.

ప్రభుత్వం ప్రకటన హర్షదాయకం



పక్షవాతంతో బాధపడుతున్నాను. కొన్నేళ్లుగా కుమారుడు తిరుపతిలో ఉండడంతో అక్కడే చికిత్సలకోసం ఉంటున్నా. గతంలో ప్రతినెలా వచ్చి పింఛన్ తీసుకెళ్లేవాడిని. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి పింఛన్ తీసుకోవచ్చన్న ప్రకటనతో తనలో ఆత్మస్థైర్యం పెరిగింది. వ్యయప్రయాసల భారం తగ్గింది.

-వలిపి నరసింహులు, బోగానిపల్లి

ఏడాదిగా ఎదురుచూస్తున్నాం



ఏడాది క్రితం భర్త చనిపోయాడు. అప్పటి నుంచి పింఛన్ కోసం ఎదురు చూస్తున్నా. కూటమి ప్రభుత్వం భర్త చనిపోయిన మహిళలకు వెంటనే వితంతు పింఛన్ ఇచ్చేందుకు ముందుకు రావడం సంతోషకరం. మాలాంటి వితంతువులకు ప్రభుత్వం అండగా ఉండటం ఆనందించతగ్గ విషయం.

- ఇద్దే రమణమ్మ, నల్లగుట్లపల్లి

వైభవంగా పెద్దమ్మ జాతర


అలంకరణలో అమ్మవారు

బత్తలపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన పెద్దమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. వడ్డే వీధిలో ఉన్న ఆలయంలో వడ్డెర కులస్థులు ప్రతి ఏటా కార్తీక మాసంలో అమ్మవారి జాతర నిర్వహిస్తారు. కాలనీలోని పెద్దమ్మ,సుంకులమ్మ అమ్మవార్లను ప్రతేకంగా అలంకరించారు. సాయంత్రం పూజార్లతో భక్తులు కలసి కల్లు దుకాణం వద్దకు వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి ఘటంతో ఊరేగింపుగా గుడి వద్దకు చేరుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా గుడి వద్దకు చేరుకొని అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండన్న, సంజప్ప, రమణప్ప, అంజనేయులు, ప్రసాదు, తిరపతయ్య, మంజు పాల్గొన్నారు.

గౌరవ డాక్టరేట్ అందుకున్న మానస


గౌరవ డాక్టరేట్‌తో మానస

ధర్మవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మానస నృత్యకళా కేంద్ర గురువు మానస గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆదివారం సాంస్కృతిక మండలిలో తనకు హోప్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డు సంస్థ గౌరవ డాక్టరేట్‌ను అందజేసినట్టు మానస తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా సెక్రటరీ బుచ్చేశ్వర రావ్, రంగస్థల సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దిపోగు ఆనంద్, బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు అనిత, సమాజ సేవకులు పవన్‌కుమార్, రాఘవ, వడ్డే రాము, దాసరి శ్వేత చేతులమీదుగా డాక్టరేట్ పట్టా అందజేశారు.

విద్యుత్ స్తంభానికి మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఓబుళదేవరచెరువు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఇలా ఉంటే ప్రమదాలు జరగవా అన్న కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ శాఖ ఏఓ రామసూరారెడ్డి, లైన్‌మన్ గంగాధర్ ఒరిగిన స్తంభాన్ని సరిచేయించారు.

రహదారి సమస్య పరిష్కారం


ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కదిరి-రాయచోటి ప్రధాన రహదారి మండలంలోని దనియాన్‌చెరువు సమీపంలో రోడ్డుపై ఊట నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. శనివారం రాత్రి సిమెంటు లారీ కూరుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం స్పందించి కాంట్రాక్టర్‌ను త్వరగా సమస్య పరిష్కరించాలని సూచించారు. వెంటనే కాంట్రాక్టర్ కూరుకుపోయిన లారీని బయటకు తీయించి, రోడ్డు కింద భాగంలో ఊట నీరు చెరువులోకి వెళ్లడానికి పైపులు ఏర్పాటు చేశారు. దీంతో సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నరేష్ (ఫైల్)

తనకల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగిరివాండ్లపల్లికి చెందిన నరేష్(25) మృతిచెందాడు. ఎస్‌ఐ గోపి తెలిపిన మేరకు సింగిరివాండ్లపల్లి గ్రామానికి చెందిన నరేష్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి అన్నమయ్యజిల్లా ములకల చెరువుకు వెళ్లాడు. అయితే లారీలో లోడు చేయక పోవడంతో తిరిగి ద్విచక్రవాహనంలో సింగిరవాండ్లపల్లి వస్తున్నాడు. చీకటిమానుసమీపంలోని ఎరువుల పరిశ్రమ వద్ద కేఎస్‌ఆర్టీసీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఆర్టీసీ డ్రైవర్ బస్సును వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్లే ప్రమాదం జరిగింది. తలకు బలమైనగాయాలు కావడంతో అక్కడికక్కడే నరేష్ మృతిచెందాడు. నరేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

ప్రయాణం.. నరకప్రాయం..!

- కంకరతేలిన గొల్లపల్లి క్రాస్ రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు


అధ్వానంగా ఉన్న గొల్లపల్లి క్రాస్ నుంచి మరూరుకు వెళ్లే రహదారి

ధర్మవరంరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి క్రాస్ నుంచి మరూరుకు వెళ్లే రహదారి కంకరతేలి గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధర్మవరం నుంచి గొల్లపల్లి క్రాస్‌మీదుగా మరూరు హైవేలోకి రోజుకు వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. 10 కి.మీ ఉన్న ఈ రహదారి అంతా కంకరతేలి గుంతలు పడ్డాయి. రాంపురం గ్రామస్థులు ప్రతిరోజు ఈ రహదారి గుండా ధర్మవరానికి రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందికరంగా ఉందని గ్రామస్థులు, వాహనదారులు వాపోతున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

ఇంటిపట్టా పేరుతో మోసం

కదిరి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నపుగుట్టతండాకు చెందిన కళ్యాణిబాయి అనే మహిళకు ఇంటిపట్టా ఇస్తామని డబ్బులు తీసుకుని, ప్రభుత్వం ఇచ్చే పట్టాను లాక్కొని దౌర్జన్యం చేసిన సభావత్ సోమ్లానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సున్నపుగుట్టతండాకు చెందిన కళ్యాణిబాయి 2018లో ఇంటిపట్టా ఇప్పిస్తామని అదే తండాకు చెందిన సోమ్లానాయక్ రూ.1.20 లక్షలు డిమాండ్ చేశారన్నారు. ఇందులో రూ. 30వేలు ఇచ్చినట్లు తెలిపారు. రెండున్నర సెంటు పట్టా ఇప్పిస్తామని సోమ్లానాయక్ రెండు సెంట్లు మాత్రమే పట్టా ఇచ్చారు. మిగిలిన డబ్బు ఇవ్వాలని ఆమె బలవంతం చేసి ఇంటిపట్టాను లాక్కొన్ని ఆమెపై జులుం ప్రదర్శించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

నల్లమాడ, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఆరువేల టీడీపీ సభ్యత్వ నమోదు చేసినట్లు కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలన్న ఆదేశాలతో 14 పంచాయతీల్లో ఇప్పటికే ఆరువేల సభ్యత్వాలు చేయించామన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా



కరపత్రాలను విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

ధర్మవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతు,కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ దేశానికి అన్నంపెట్టే రైతు, సర్వసంపదలు సృష్టించే కార్మికులు బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక అప్పులు ఊబిలో కూరుకుపోయి, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. రైతులను ఇబ్బందులు కల్గించే మూడు నల్లచట్టాలను పూర్తిగా రద్దు చేయకుండా ఇప్పటికే వాటి విధానాలను కొనసాగిస్తూ స్మార్ట్‌మీటర్లు రైతులకు, ప్రజలకు బిగుస్తున్నారన్నారు. కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు ఎస్‌హెచ్‌బాషా, మండల కో-కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ పాల్గొన్నారు.


తూముల ద్వారా నీరు వదలుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

చెరువులకు నీరిచ్చిన ఘనత చంద్రబాబుదే

- ఎమ్మెల్యే, మాజీ మంత్రి

బుక్కపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెరువులకు నీరు ఇచ్చిన చరిత్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడకు దక్కుతుందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం బుక్కపట్నం చెరువు కింద ఉన్న ఆయకట్టు భూములకు నీటిని విడుదల చేశారు. ముందుగా చెరువులో గంగకు రైతులతో కలిసి పూజలు చేశారు. అనంతరం తూము గేట్లు ఎత్తి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకసారి గత చరిత్రను పరిశీలిస్తే ఈ ప్రాంత చెరువులకు పలుమార్లు హంద్రీనీవా ద్వారా నీటిని ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను గత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే, కూటమి ప్రభుత్వం ఈబడ్జెట్‌లో రూ.16వేలకోట్లకు పైగా నిధులు కేటాయించి, నీటికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్-2047 లక్ష్యంతో పేదరికం లేని రాష్ట్రంగా మార్చాలన్న లక్ష్యంతో పాలన సాగిస్తున్నట్లు చెప్పారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలను హార్టికల్చర్, అగ్రికల్చర్ హబ్‌గా మార్చడానికి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. బుక్కపట్నం చెరువును ప్రతి ఏడాది నింపడంతో పాటు మధ్యలో సత్యసాయిబాబా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ బుక్కపట్నం చెరువు రాయలసీమలోనే అతి పెద్ద చెరువన్నారు. ఈచెరువు ఆయకట్టుకింద పదివేల ఎకరాలు సాగవుతుందన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో మూడుమార్లు కృష్ణజలాలతో నింపామన్నారు. తహసీల్దార్ షాబుద్దీన్, ఇరిగేషన్ జేఈలు జమునాబాయి, సుధాకర్ రాజు, మండలకన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు గంగాధర్, సుబ్బారెడ్డి, చెన్నక్రిష్ణ, సంజీవరాయుడు, బాలు, సాకేయశోద పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి


విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న టీడీపీనాయకులు, చేనేత ప్రముఖులు

ధర్మవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గెలుపోటములను సమానంగా తీసుకోవాలని టీడీపీ నాయకులు, చేనేత ప్రముఖుడు సంధారాఘవ సూచించారు. సంధారాఘవ, ఆయన సోదరుడు సంధా రవీంద్ర ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఫ్రెండ్లీ టోర్నీ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో డ్రాగన్ జట్టు, గొట్లూరు జట్లు తలపడ్డాయి. ధర్మవరానికి చెందిన డ్రాగన్‌జట్టు విన్నర్‌గా, గొట్లూరు జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. విన్నర్ జట్టుకు రూ.లక్ష, రన్నర్ జట్టుకు రూ.50వేలు సంధారాఘవ అందజేయగా, మూడో బహుమతి రూ.20వేలు మాంగళ్యశిల్క్ హౌస్ యజమాని జింకాపురుషోత్తం అందజేశారు. నాల్గవ బహుమతి రూ.10వేలు అందజేశారు. సంధా రాఘవ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని అన్నారు. జింకా పురుషోత్తం, చందు, పూజారి జనార్ధన్, శశాంక్, చౌడయ్య, కృష్ణమూర్తి, విశ్వనాథ్, ఫిరోజ్ పాల్గొన్నారు.

అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ఐద్వా నాయకులు

ధర్మవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖలో లా విద్యార్థినిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. ఆదివారం సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో-కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లిపెద్దన్నలతో పాటు ఐద్వా నాయకులు కళాజ్యోతి సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ...విశాఖలో లా చదువుతున్న విద్యార్థినిపై అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి ప్రేమించి వివాహం చేసుకుంటానని మోసం చేశాడన్నారు. ఆమెను, అతని స్నేహితులు కలిసి అఘాయిత్యానికి పాల్పడి శారీరకంగా, మానసికంగా హింసించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించాలని, విద్యార్థిని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. జయమ్మ, చౌడమ్మ, ముంతాజ్, నాగవేణి, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతుకు తీవ్రగాయాలు

గాండ్లపెంట, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీ బాపనోళ్లపల్లికి చెందిన రైతు రమణారెడ్డి ఆదివారం విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన మేరకు బాపనోళ్లపల్లి గ్రామసమీపంలో ఉన్న వ్యవసాయ బోరు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజు వేయడానికి రమణా రెడ్డి వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ తగలడంలో కాలు, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలంచారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు చెప్పారు. విద్యుత్‌శాఖాధికారులు కనీసం ఫీజు వేయాలన్నా డబ్బులివ్వాల్సిందే అని వాపోతున్నారు. సకాలంలో ఫీజు వేయడానికి రారన్నారు. ఇలాంటి సమయంలో రైతులే కట్టెలతో ఫీజులు వేసుకోవాల్సిన దుస్థితి నెలకుందన్నారు. విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యంతోనే రైతులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.

ఘనంగా కనకదాస జయంతి



ఆకట్టుకున్న మహిళల నృత్యాలు

హిందూపురం అర్బన్, నవంబరు 24,(ఆంధ్రజ్యోతి): పటణ పరిధిలోని సూగూరు సడ్లపల్లిలో కురుబల ఆరాధ్యదైవం శ్రీ కనకదాసు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపున్నారు. ఉదయం మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి కనకదాసు విగ్రహానికి హారతులిచ్చారు. మధ్యాహ్నం కనకదాసు చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా కర్నాటక నుంచి వచ్చిన మహిళలు చేసిన నృత్యాలు విశేషంగా అకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సునితా లింగారెడ్డి, వెంకటేష్‌రెడ్డి, బసప్ప, కిష్టప్ప, నారాయణప్ప, శ్రీనాథ్, మల్లి, రాందాస్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, అశ్వర్థప్ప, ఆడివప్ప, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి అలవరుచుకోవాలి



ఎన్‌సీసీడేలో పాల్గొన్న విద్యార్థులు

హిందూపురం అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి దేశ భక్తి అలవరుచుకోవాలని ఎస్‌డిజిఎస్ కళాశాల సంయుక్త కార్యదర్శి దాస గంగాధర్ పేర్కొన్నారు. కళాశాలలో ఆదివారం 76వ ఎన్‌సీసీ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశసేవ చేయాలనే సంకల్పంతో ఉన్నవారు చదువు తరువాత ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ పోలీస్ లాంటి వ్యవస్థల్లో సేవలందించేందుకు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎన్‌సీసీలో చేరిన వారికి ఏ సర్టిఫికెట్, బీ, సీ, సర్టిఫికెట్‌లు ఉంటే అన్ని రంగాల్లో రిజర్వేషన్ కూడా ఉంటుందన్నారు. అదే విధంగా ఎన్ఎస్ఎస్‌లో కూడా పాల్గొని స్వచ్ఛతపై అవగాహన పెంచుకోవడమే కాకుండా సేవాగుణాన్ని అలవరుచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా జండా అవిష్కరించి ఎన్‌సీసీ విద్యార్థులు అందించిన వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ఎంబిఏ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఫణీంద్ర, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రాజన్న, పీడీ హేమంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

29న మినీ కల్యాణ మండపం లీజు వేలం

హిందూపురం అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సూగూరు ఆలయం ముందుభాగంలో ఉన్న మినీ కల్యాణమండపం లీజుకు ఈనెల 29న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహమూర్తి ప్రకటనలో పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు హిందువులై ఉండాలన్నారు. 29 ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తారన్నారు. పాల్గొనేవారు రూ.50 వేలు ధరావత్తు చెల్లించి రసీదు పొందాలన్నారు. వివరాలకు 7993559874ను సంప్రదించాలన్నారు.

సహకార సొసైటీ కార్యదర్శిగా శ్రీరాములు

హిందూపురం అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ సత్యసాయిజిల్లా కార్యదర్శిగా శ్రీరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఆదివారం జిల్లా స్థాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హిందూపురం కో-ఆపరేటివ్ సొసైటీ డివిజినల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీరాములును కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినవారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యలపై శక్తి వంచన లేకుండా పోరాడుతానన్నారు. తన ఎంపికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రొద్దంలో ఉచిత వైద్య శిబిరం

పెనుకొండ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రుక్మిణమ్మ మాడిశెట్టి సీతారామయ్య జ్ఞాపకార్థం ఆదివారం వైద్యశిబిరం నిర్వహించినట్లు రొద్దం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. రొద్దం మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన రోగులను ప్రముఖ వైద్యనిపుణులు సీతారాం, శ్రీనివాసులు, నరేంద్రకుమార్, రమ్య, నరేష్, వర్ష, దీక్షిత్, నిక్షిత్, పల్లవి, విరుపాక్షి, సౌరవ్, సిబ్బంది పరీక్షించి మందులు పంపిణీ చేశారన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

పెనుకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులకు పట్టణానికి చెందిన యువ న్యాయవాది సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో 41రోజుల ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆదివారం స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో గురుస్వామి మోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు చేతులమీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

పొలమరాజుకు ప్రత్యేక పూజలు



పొలమరాజుకు పూజలు నిర్వహిస్తున్న యువకులు

చిలమత్తూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని ఎర్రకొండ ఫారెస్ట్ నర్సరీ వద్ద వెలసిన పొలమరాజుకి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన యువకుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పొలమరాజు విగ్రహానికి పుష్పాలంకరణ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయభాస్కర్, నాగేంద్ర, మల్లికార్జున, హరి, ఆనంద్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

గుడిబండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గుడిబండ పోలీస్‌స్టేషన్‌ను పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకొన్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, గ్యాంబ్లింగ్, కర్ణాటక అక్రమ మద్యం తదితర కార్యకలాపాలు లేకుండా చూడాలని పోలీసులకు సూచించారు. వీరి వెంట సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ మునిప్రతాప్, పోలీసు సిబ్బంది మహ్మద్‌రఫీక్ తదితరులు ఉన్నారు.

మట్టే మనీ



చెన్నాపురం వద్ద మట్టిని తవ్వుతున్న దృశ్యం

- సోమందేపల్లిలో అధికారం అండతో దర్జాగా తరలింపు
- రూ.లక్షలు వెనకేసుకుంటున్న నాయకులు ● అధికారుల మౌనం
- ప్రజాప్రతినిధి పేరుతో తప్పించుకుంటున్న వైనం

హిందూపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల పరిధిలో మట్టిదోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంతమంది అధికార పార్టీ నాయకులు మట్టి దోపిడీని సంపాదనామార్గంగా ఎంచుకున్నారు. సహజంగా ఉన్న గుట్టలను మట్టి మాఫియా తవ్వి తరలించుకుపోతోంది. దీంతో మండలంలో కొన్నిచోట్ల ఉన్న గుట్టలు భవిష్యత్తులో కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అక్కమ్మగార్ల కొండవద్ద చెన్నాపురం వద్ద ఉన్న ఎర్రమట్టిని నిత్యం వందలాది ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. వేకువజాము నుంచి 10గంటలలోపే ఈ తంతు పూర్తిచేస్తున్నారు. 10గంటలకు అధికారులు కార్యాలయాలకు చేరుకుంటారు కాబట్టి ఆలోపే మట్టిని తరలిస్తూ ఆ తరువాత ఆపేస్తున్నారు. జే సీబీ, ట్రాక్టర్ యజమానులు అధికారులను మచ్చిక చేసుకుని మట్టిని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల కళ్లముందే గుట్టలు కరిగిపోతున్నా తమకేమి పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు.

లక్షలు వెనకేసుకుంటున్నవైనం

కొండ, గుట్ట, చెరువుల్లో మట్టిని తరలిస్తూ గృహనిర్మాణదారులకు రియల్ ఎస్టేట్ వెంచర్లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరిలో అధికార పార్టీకి చెందిన నాయకులే అధికంగా ఉన్నట్లు తెలుస్తుంది. నిత్యం సోమందేపల్లి మండల పరిధిలో పది నుంచి 15జేసీబీలు, 40నుంచి 50 ట్రాక్టర్లు మట్టి తరలింపుకే పనిచేస్తున్నాయి. దీనినిబట్టి ఎంతమేర లబ్ధి చేకూరుతుందో అర్థం అవుతుంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ముందుగానే మట్టిమాఫియాకు సమాచారం ఇచ్చి ఎవరూలేరని చేతులు దులుపుకుంటున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్‌శాఖ, ఇరిగేషన్‌శాఖలు అలసత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. నిత్యం ట్రాక్టర్లు మట్టిని భారీగా తరలిస్తున్నా ఇప్పటి వరకు పెద్దగా కేసులు పెట్టినట్లు, వాహనాలు సీజ్‌చేసినట్లు కనిపించలేదు. దీంతో వారి మధ్య ఎలాంటి బంధం ఉందో ఇట్టే అర్థం అవుతుంది.



అక్కమ్మగార్ల కొండవద్ద మట్టి తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రజాప్రతినిధి పేరుతో తప్పించుకుంటున్న వైనం

ఇదిలా ఉంటే మట్టిని తరలిస్తున్న అక్రమార్కులను ఎవరైనా అధికారులుకానీ ఇతర శాఖలవారు ప్రశ్నిస్తే ఆ నియోజకవర్గంలో ముఖ్య ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి తప్పించుకుంటున్నట్లు ఓ అధికారి వాపోయారు. దీంతో ఎక్కడ వారిపై కేసులు కడితే మాకు ముప్పువస్తుందోనని అధికారులు జంకుతున్నట్లు తెలుస్తుంది ఎందుకంటే మట్టిమాఫియాలో అధికశాతం అధికార పార్టీవారు ఉండటంతో అధికారులు కూడా ఓ అడుగు వెనకేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ మట్టి తరలింపు సదరు ప్రజాప్రతినిధులకు తెలిసి చేస్తున్నారా? తెలియక చేస్తున్నారా? అనేది వారే చెప్పాలి. ఏది ఏమైనా సోమందేపల్లి మండలంలో ఇటీవల మట్టి మాఫియా చెలరేగిపోతోంది. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో మట్టి దొరకకుండా పోయే ప్రమాదముంది.

అనుమతులు లేకుండా తరలిస్తే కఠిన చర్యలు

అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నాం. రైతులకు ఎవరికైనా చెరువుమట్టి కావాలంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. అక్రమంగా మట్టి ఎవరు తరలించినా, సహజవనరులను దోచేస్తుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయి.

రెడ్డిశేఖర్, ఇన్‌చార్జి తహసీల్దార్, సోమందేపల్లి

అర్ధంతరంగా ఆగిన అంగన్‌వాడీ భవనం



నిర్మాణం పూర్తికాని అంగన్‌వాడీ భవనం

అగళి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అగళి మండలం గాయిత్రి కాలనీలో 2021-22లో నాడు నేడు కింద అంగనవాడీ భవనాన్ని మంజూరు చేశారు. రూ.13లక్షల రూపాయలతో ఈ భవన నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వమే కిటికీలు, డోర్లు, సరఫరా చేసి ఫ్లోరింగ్ విద్యుత్, రంగులు వేసి నిర్మాణం పూర్తిచేయాల్సి ఉందని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం ఓ కమ్యూనిటీ భవనంలో నడుస్తోందని, ఆ భవనం వర్షం వచ్చినప్పుడు జలమయంగా మారుతుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి నాడు నేడు కింద మంజూరైన అంగనవాడీ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

28న చౌడేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

అగళి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : అగళి మండలం రామాపురం గ్రామంలో ఈనెల 28, 29తేదీలలో చౌడేశ్వరీ నూతన విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం, నూతన కలశస్థాపన నిర్వహించనున్నట్లు ఆలయ పూజారుతెలిపారు. 28న రాత్రి విగ్రహప్రతిష్ఠ, 29 ఉదయం 5-30కు కలశస్థాపన ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చిత్రలింగేశ్వరస్వామి, చౌడేశ్వరి కృపకు పాత్రులవ్వాలన్నారు.

నీలకంఠాపురంలో వైభవంగా చండీహోమం

మడకశిర రూరల్, నవంబరు 24 :(ఆంధ్రజ్యోతి) మండలంలోని నీలకంఠాపురం దేవస్థానంలో ఆదివారం చండీ హోమం వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రి, దేవాలయ చైర్మన్ రఘువీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో లోక కల్యాణాన్ని ఆకాంక్షించి ఈ హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ఈ కార్యక్రమంలో రఘువీరారెడ్డి కుటుంబసభ్యులు, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న రఘువీరారెడ్డి

ఫుట్‌బాల్ విజేత యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్

హిందూపురం అర్బన్, నవంబరు 24,(ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆటల మైదానంలో ఆదివారం జరిగిన ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌లో హిందూపురం యునైటెడ్ ఫుట్ బాల్ క్లబ్ విజేతగా నిలిచింది. ఆర్‌డిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14లీగ్ మాచ్‌లో హిందూపురం ఫుట్‌బాల్ క్లబ్, హిందూపురం టౌన్ క్లబ్‌లు తలపడగా 2-0తేడాతో యునైటటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ గెలుపొందింది. అదే విధంగా అండర్ 12 బాలుర సౌత్‌జోన్ క్వాలిఫయర్స్ మ్యాచ్‌లో హిందూపురం యునైటెడ్ ఫుట్‌బాల క్లబ్, పరిగి నార్త్ ఫుట్‌బాల్ క్లబ్‌లు తలపడగా యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ 1-0 తేడాతో గెలుపొందింది. గెలుపొందిన టీంల్ త్వరలో జరుగు రూరల్ ఫుట్‌బాల్ లీగ్‌లో పాల్గొంటాయి. మ్యాచ్‌లకు హైకోర్టు జీపి, హిందూపురం ఫుట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అశ్వర్థనారాయణ, యునైటెడ్ ఫుట్‌బాల్ కల్బ్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యసాయి జిల్లా ఫుట్‌బాల్ సంఘం కోశాధికారి శేఖర్‌లు ముఖ్యఅతిథులుగా హాజరైనారు, ప్రతిభా క్రీడాకారులను అభినందించారు.



గెలుపొందిన జట్టు

ఘనంగా కార్తీక వనభోజనాలు

గోరంట్ల, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : ట్రస్టు ఏర్పాటు చేయడం ద్వారా విద్య, వైద్యం, తదితర రంగాల్లో బలిజల అభ్యున్నతికి కృషి చేస్తామని బలిజ సంఘం నాయకులు, టీడీపీ మండలకన్వీనర్ సోముశేఖర్ తెలిపారు. మండలంలోని ఎముకలగుట్లపల్లి వద్దగల మినీ తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఆదివారం కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని బలిజ సంఘం నిర్వహిం చింది. బలిజల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. చిన్నారులు వన్సీకా, వేదప్రజ్ఞానలు నాట్యంతో అలరించగా, భజన బృందం భక్తిగీతాలు పాడారు. నృత్యం చేసిన చిన్నారులకు రూ. 5వేలు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు ప్రిన్సిపల్ సూర్యనారాయణ, సీఐ రామక్రిష్ణ, రామచంద్రారెడ్డి, క్రిష్ణప్రసాద్, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, డ్యాన్స్ బాలాజీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న బలిజ కులస్థులు

అవిముక్తేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో..

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక ఘనగిరి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం స్థానిక అవిముక్తేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు కన్నాస్వామి, మూర్తి, శ్రీధర్‌శర్మ, పంచాంగం శేషప్పస్వామి, సుబ్రమణ్యశాస్త్రి, నాగభూషణ శాస్త్రితోపాటు పట్టణంలోని బ్రాహ్మణులంతా పాల్గొన్నారు.



ఉసిరిచెట్టుకింద భోజనాలు చేస్తున్నదృశ్యం

ప్రారంభమైన కార్తీక మాస ప్రత్యేక పూజలు

అమరాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల పరిధిలోని హేమావతి శ్రీ హెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈసందర్భంగా సిద్దేశ్వరస్వామికి వివిధ అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణతో మంగళహారతి ఇచ్చి తీర్థప్రసాద పంపిణీ చేశారు.



సిద్దేశ్వరస్వామి

27న పి.సి.గిరి చేపల చెరువు వేలం

గుడిబండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.సి గిరి, బైరేపల్లి చేపల చెరువులను ఈనెల 27వతేదీ బుధవారం వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

బాలుడిని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పెనుకొండ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీ తిమ్మాపురంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. తిమ్మాపురం గ్రామానికి చెందిన గొల్ల కిష్టప్ప, చంద్రకళ కుమారుడు వంశీకృష్ణ ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సెలవుకావడంతో మధ్యాహ్నం రోడ్డు దాటుతుండగా పుట్టపర్తి-హిందూపురం ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి బాలుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వంశీకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన బాలుడిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని రొద్దం మండలం కలిపి గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి ఒక వ్యక్తితోపాటు 35కర్నాటక మద్యం బాటిళ్లు స్వాదీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు సూచించారు. ఆదివారం ఎక్సైజ్ ఎస్ఐలు వీజీ రాము, రాజశేఖర్, సిబ్బంది, గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నరసింహమూర్తి అనే వ్యక్తి వద్ద 35కర్నాటక మద్యం ప్యాకెట్లు లభించాయన్నారు. అతనిపై కేసు నమోదుచేసి స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కర్నాటక మద్యం సరఫరా చేసినా, బెల్ట్‌షాపులునిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పావగడ ప్రజల ఆదరణ మరువలేనిది



మాట్లాడుతున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని

పావగడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కళ్యాణదుర్గం వచ్చి తన గెలుపు కోసం కృషిచేసిన పావగడ ప్రజల ఆదరణ తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని ఘట్టం అని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలియజేశారు. ఆదివారం పావగడ పట్టణంలోని శ్రీశాల ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన కమ్మ కార్తీక వనమహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి వెలిగించి మాట్లాడారు. కమ్మ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా విద్యార్థి నిలయాలకు, విద్య ఎదుగుదలకు తన వంతు కృషి చేశానని, ప్రతి ఒక్కరు విద్యార్థుల విద్యారంగానికి తల్లిదండ్రులు చైతన్య వంతులుగా తీర్చిదిద్దాలని తెలియజేశారు. మైసూరు అసిస్టెంట్ కమీషనర్ రఘునందన్ మాట్లాడుతూ, నేటి కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరు పోటీపడి ఎదిగినప్పుడే ప్రయోజకులు కాగలరని తెలియజేశారు. ఈసందర్భంగా విశ్రాంత జిల్లా కలెక్టర్ రామాంజనేయులు, గోవిందప్ప, డాక్టర్ వెంకటరామయ్య, నరసింహయ్య, తుమకూరు అటవీ శాఖ అధికారి అనుపమ, దక్షిణభారత జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ వెంగమేష్‌చౌదరి, రైతు సంఘం ఉపాధ్యక్షులు వేణుగోపాల్, నల్లాని సురేంద్ర, తాల్లూరు గోవిందు, అన్నదానపురం జయరాం, అమిలినేని నరేష్, అమిలినేని మూర్తి, అనేక మంది కమ్మ కులస్తులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు - వ్యక్తి మృతి

సోమందేపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పేటకుంట సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యనారాయణ(42) అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమందేపల్లి మండల కేంద్రంలోని నక్కలగుట్టకాలనీకి చెందిన సూర్యనారాయణ పాలసముద్రం వద్ద ఉన్న నాసెన్ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజూవారిలా శనివారం రాత్రి విధుల్లోకి వెళ్లి ఆదివారం ఉదయం ఇంటికి బైక్‌మీద బయలుదేరాడు. అయితే పేటకుంట సమీపంలో బెంగళూరు-అనంతపురం వైపు వెళ్తున్న కారు వెనుక నుండి బలంగా ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మృతునికి భార్య కృష్ణవేణి, కుమారుడు తేజ, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బడుగు, బలహీన వర్గాలకు టీడీపీతోనే న్యాయం

చిలమత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):బడుగు బలహీన వర్గాలకు టీడీపీలోనే న్యాయం జరుగుతుందని రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన ఆయనను మండలంలోని చిన్నప్పరెడ్డిపల్లిలో ఆదివారం టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తననుఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ ఆశలను అడియాశలు చేయకుండా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనను టీడీపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ సూరి, నాయకులు గడ్డం కిష్టప్ప, పాలకిష్టప్ప, లింగప్ప, వెంకటసుబ్బయ్య, నారాయణస్వామి, ఇదాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.



బేకరీ గంగాధర్‌ని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సవిత

పెనుకొండ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెనుకొండ నగరపంచాయతీ ఇస్లాపురం గ్రామంలో అఖిల్ కుటుంబాన్ని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పరామర్శించారు. రెండు రోజుల క్రితం ఇస్లాపురం గ్రామ సమీపంలో నాగప్పకుంట కట్టపై బస్సు ప్రమాదంలో అఖిల్ అనే విద్యార్థి మృతిచెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న మంత్రి సవిత ఆ గ్రామానికి చేరుకుని అఖిల్ తల్లిదండ్రులైన వడ్డినాగరాజు, రాధమ్మలను పరామర్శించారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ కేశవయ్య, మండల కన్వీనర్ శ్రీరాములు, తదితర కూటమి నాయకులున్నారు.



అఖిల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సవిత

పూజల్లో పాల్గొన్న మంత్రి

సోమందేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చాలకూరు గ్రామంలో వెలసిన ఉమా మహేశ్వరుని ఆలయంలో ఆదివారం జరిగిన పూజల్లో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజార్లు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న దండువీరయ్య

రొళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కమీషన్‌ను వెంటనే అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండువీరయ్య కోరారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ కోసమే కమీషన్ సాధించామన్నారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ జాబితాలో ఉన్న 59 కులాలను నాలుగు కేటగిరీలుగా విభజిస్తూ 1997లో రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చిందని, అత్యున్నత న్యాయస్థానం 2024 ఆగస్టులో సంచలన తీర్పు ఇచ్చిందన్నారు. అదేవిధంగా దీనిపై కమీషన్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం నియమించిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్తరంగప్ప, కార్యదర్శి శ్రీనివాస్‌మాదిగ, ఎం.ఆర్.హనుమంతు, లక్ష్మీనారాయణ, మోతి రామ్‌నాయక్, గోవిందప్ప, కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదాస జయంతి

మడకశిర రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కల్లుమర్రిలో కనకదాసు జయంతి వేడుకలను ఆదివారం కురుబలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపుగావచ్చి విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేశారు.